## ఓటరు చైతన్య కార్యక్రమాలు


ఓటర్లను చైతన్య పరుస్తున్న కళా బృందాలు

తిరుమలాయపాలెం, అక్టోబర్ 31: మండలంలోని తిరుమలాయపాలెం, సుబ్లేడు, కాకరవాయిలో మంగళవారం ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. సాంస్కృతిక కళా బృందాలు జానపద కళారూపాల ద్వారా కళాకారులు ఓటు ప్రాధాన్యతను ప్రజలకు వివరంచారు. తహసీల్దార్ రాంప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

కూసుమంచి రూరల్, అక్టోబర్ 31: మండల పరిధిలోని గట్టుసింగారంలో మేడిపల్లి తిరుపతమ్మకు చెందిన ఇంట్లో కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి ధగ్ధమైంది. తిరుపతమ్మ భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. కొడుకు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. తిరుపతమ్మ కూలీ పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది. స్థానిక బీఆర్ఎస్ నాయకుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కందాళ ఆమెకు ఆర్థిక సాయం అందించారు.

## కానిస్టేబుల్స్‌గా ఎంపికైన ఆర్జేసీ విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 31: పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో నగరంలోని ఆర్జేసీ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు 12మంది ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం ఎంపికైన వారిని అభినందించి అనంతరం మాట్లాడారు. 2023లో 12 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమన్నారు. విద్యతో పాటు విద్యార్థులకు ఆసక్తి గల రంగాల్లో శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలవాల లింగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

## త్రివేణిలో ఘనంగా ఐక్యతా దినోత్సవం

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 31: నగరంలోని త్రివేణి పాఠశాలలో మంగళవారం ఉక్కు మనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాఠశాల డైరక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, కృష్ణవేణి-త్రివేణి విద్యాసంస్థల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ పాల్గొన్నారు.

## ఎన్నికల విధులపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్

మామిళ్లగూడెం, అక్టోబర్ 31: ఎన్నికల విధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పాలేరు నియోజకవర్గ పోలింగ్ అధికారులకు, ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఖమ్మం నియోజకవర్గ పోలింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. శిక్షణకు హాజరయిన పోలింగ్ అధికారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేందుకు పోలింగ్ అధికారులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. పాలేరు రిటర్నింగ్ అధికారి, ఎస్డీసి రాజేశ్వరి, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారిణి, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, తహసీల్దార్లు రామకృష్ణ, సిహెచ్. స్వామి, శ్వేత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోడౌన్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

మామిళ్లగూడెం: నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో రూ. 2.78 కోట్లతో నిర్మిస్తున్న ఈవీఎం గోడౌన్ నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ గౌతమ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఈవీఎం గోడౌన్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా వేగం పెంచాలన్నారు. మొదటి అంతస్తులో పనులను పరిశీలించి, అన్ని కిటికీలు, వెంటిలేటర్లకు ఉంచిన ప్రదేశాలు మూసి వేయాలన్నారు. భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. గోడౌన్ ముందు, వాహనాల కదలికల మేరకు స్థలం ఉంచి, ప్రహరి గోడ ఏర్పాటుకు, అప్రోచ్ రోడ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. లేబర్‌ను పెంచాలని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, రోడ్లు, భవనాల శాఖ ఏఈఈ విశ్వనాథ్, అధికారులు తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం : ఎమ్మెల్యే


బీఆర్ఎస్‌లో చేరుతున్న కామంచికల్ నాయకులు


బీఆర్ఎస్‌లో చేరుతున్న నేలకొండపల్లి కాంగ్రెస్ నాయకులు

ఖమ్మం రూరల్, అక్టోబర్ 31: బీఆర్ఎస్ సర్కార్‌లోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరిగిందని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన కాంగ్రెస్, వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. రూరల్ మండలం కామంచికల్ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు జలగం ఉపేందర్, గాడిపెల్లి వెంకన్న, రుద్ర నాగేశ్వరరావు, బాల నాగన్న పార్టీ నాయకుడు మేదరమట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందాళ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నేలకొండపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రేపాకుల సూరయ్య పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావం తరువాత సీఎం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టారని అన్నారు. నిత్యం ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకునే నాయకులను గుర్తించాలన్నారు. ఐదేళ్లగా పాలేరు ప్రజలే కుటుంబ సభ్యులుగా భావించి కందాళ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మహిళలకు అండ.. గులాబీ జెండా

### ఇంటింటి ప్రచారంలో దీప్తి


ఖమ్మం రూరల్ : ఇంటింటి ప్రచారంలో దీప్తి


కూసుమంచి రూరల్ : మహిళకు బొట్టు పెట్టి ఓటు అడుగుతున్న కందాళ దీపిక

ఖమ్మం రూరల్, అక్టోబర్ 31: మహిళలకు అండగా గులాబీ జెండ అని ఎమ్మెల్యే కందాళ కూతురు దీప్తి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆమె ఎమ్మెల్యే కందాళ విజయాన్ని కాంక్షిస్తూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్‌తో కలిసి పెద్దతండ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. నుదిటిన తిలకం పెట్టి ఇంటిల్లిపాది కందాళకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. వారితో పాటు మహిళలు పెద్ద ఎత్తున స్వచ్చందగా కందాళకు మద్దతు ఇవ్వాలని విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 30న కారు గుర్తుకు ఓటేసి కందాళకు మెజార్టీ అందివ్వాలని వారు కోరారు. గిస్కా కృష్ణ, మేకల ఉదయ్, శీలం రవికుమార్, మానుకొండ శ్రీను, రెడ్యా నాయక్, బోయిన కృష్ణ, కొట్టె నాగభూషణం, బానోత్ మోహన్, పెయింట్ కుమార్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, అక్టోబర్ 31: పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని కాకరవాయిలో కందాళ ఉపేందర్‌రెడ్డి కుమార్తె దీప్తిరెడ్డి మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పొలాల్లోకి వెళ్లి కూలీలను కలిసి కందాళ ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామ ఇన్‌చార్జి కందాళ స్టాలిన్‌రెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

### నర్సింహులగూడెంలో దీపిక ప్రచారం

కూసుమంచి రూరల్, అక్టోబర్ 31: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కందాళ కుటుంబమంతా అండగా ఉన్నామని, ఇక ముందు కూడా అలాగే ఉంటామని దీపిక అన్నారు. మండలంలోని నర్సింహులగూడెంలో మంగళవారం ఎమ్మెల్యే కందాళ కూతురు దీపిక ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి, మహిళలకు బొట్టు పెట్టి ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో జడ్పీటీసీ ఇంటూరి బేబీ శేఖర్, వైస్ ఎంపీపీ కందాళ పద్మ, ఆత్మ చైర్మన్ ఆర్.బాలకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య, ఆసిఫ్ పాషా, ఎంపీటీసీ బజ్జూరి రామిరెడ్డి, సర్పంచ్‌లు మందడి పద్మ, వెంకటేశ్వర్లు, నాయకులు పరుశురామ్, షేక్ అలీ, సుధారాణి పాల్గొన్నారు.

# ఓటు ప్రజాస్వామ్యానికి పునాది


నవంబర్ 30 పోలింగ్ తేదీ సూచించే బ్యాడ్జ్ పెట్టుకోవాలని సూచిస్తున్న కలెక్టర్ వి.పి గౌతమ్

మామిళ్లగూడెం, అక్టోబర్ 31: ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటు అనే రెండక్షరాల పదం దేశ చరిత్రనే మార్చేస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో మంగళవారం కలెక్టరేట్‌లో వినూత్నంగా ప్రభుత్వ సిబ్బందికి నవంబర్ 30న ఓటు వేయాలని ప్రత్యేకంగా రూపొందించిన బ్యాడ్జీలు, ప్రభుత్వ వాహనాలకు స్టిక్కర్లు కలెక్టర్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే, పట్టణ ప్రాంతంలో పోలింగ్ శాతం తక్కువగా ఉంటుందని, 70 శాతం పోలింగ్ పట్టణంలో జరిగిందని, పోలింగ్ శాతం పట్టణ ప్రాంతాల్లో పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీరామ్, సీపీవో ఏ. శ్రీనివాస్, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఖమ్మం సిటీ, అక్టోబర్ 31: స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. మంగళవారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ పౌరులకు ఓటు భారత రాజ్యాంగం కల్పించిన హక్కని, ఎంతో విలువైన ఆయుధమని, ప్రలోభాలకు లొంగి అమ్ముకోవద్దన్నారు. ఆదిశగా చర్చను కొనసాగిస్తూ గ్రామస్తుల్లో అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాల్సిన భాధ్యత యువతపై ఉందన్నారు. దేశంలో ప్రజలందరూ సమానమని, అందరికీ ఒకే ఓటు ఉంటుందని పేర్కొన్నారు. ఓటు వేయడం సామాజిక భాధ్యత అని, యువత తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి కే శ్రీరామ్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సరిత, డాక్టర్ సదానందం, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బీ కిరణ్ కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

## 3న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 31: విద్యా ప్రమాణాలు, భాషా గణిత నైపుణ్యాల స్థాయిని నిర్ధారించేందుకు ఎన్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో స్టేట్ ఎడ్యుకేషనల్ సర్వే జిల్లాలో నవంబర్ 3న నిర్వహించనున్నారు. 854 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే 3, 6, 9వ తరగతిలకు చెందిన 20 వేల మంది విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించనున్నారు. నవంబర్ 2వ తేదీన చివరి సాధన పరీక్షలు నిర్వహించి ఫైనల్ పరీక్షను నవంబర్ 3న ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించి సర్వే పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియను పరీక్షించేందుకు మండల స్థాయిలో 44మంది బ్లాక్ స్థాయి సమన్వయకర్తలుగా, మండల విద్యాధికారులను, మండల నోడల్ అధికారులను, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను గుర్తించి జిల్లా స్థాయిలో వారికి శిక్షణ కల్పించారు. సాధన పరీక్ష నిర్వహణకు 944 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు నవంబర్1న మండల స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు.

### జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలు

ఎన్‌సీఈఆర్‌టీ నిపుణులు రూపొందించిన ప్రశ్నాపత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. ఫలితాలను ఎస్ఐఎమ్ఎస్ పోర్టల్ నందు నమోదు చేసి వాటి ఆధారంగా బోధన అభ్యాసన ప్రక్రియలు మార్పులు చేసి విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందేలా ప్రణాళికలు రచించనున్నారు. ఈ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా కృషి చేయాలని డీఈవో సోమశేఖరశర్మ కొరారు.